ప్రజాశక్తి
ఆదివారం 31 ఆగస్టు 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

రైతులను సంక్షోభం నుంచి బయటకు తెచ్చేలా

పొగాకు కొనుగోలు చేపట్టాలి

ఎపి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి - పర్చూరు, బాపట్ల జిల్లా

రైతులను సంక్షోభం నుంచి బయటకు తెచ్చేలా పొగాకు కొనుగోలు చేపట్టాలని ఎపి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఎస్‌డబ్ల్యుసి మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి కలిసి ఆమె పర్చూరు మండలంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పర్చూరు మార్కెట్ యార్డు లోని గోదాములో నిల్వచేసిన పొగాకు బేళ్లను పరిశీలించారు. పొగాకు కొనుగోల తీరుపై ఆరా తీశారు. పొగాకు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోళు,, గోదాములలో నిల్వ, ప్రాసెసింగ్ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో వ్యవసాయ మార్కెట్‌యార్డులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయ

పొగాకును పరిశీలిస్తున్న విజయ సునీత

సునీత మాట్లాడుతూ సంక్షోభం

▶ 2లో

'శ్రీశైలం'ను వివాదాల్లోకి లాగొద్దు

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం ఆలయాన్ని వివాదాల్లోకి లాగడం మంచిది కాదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శ్రీశైలం దేవాలయాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలని మీడియాలో వస్తున్న ప్రచారాలపై మంత్రి స్వామి తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియాతో స్పందించారు. కొంతమంది రెండు జిల్లాల మధ్య చిచ్చు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నారన్నారని తెలిపారు. మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు,

మాట్లాడుతున్న మంత్రి స్వామి

కనిగిరి, దర్శి పశ్చిమప్రాంతాలను

▶ 2లో



గిద్దలూరులో న్యాయ సేవా శిబిరం

ప్రజాశక్తి-గిద్దలూరు

నల్సా పథకం 2015పై శనివారం ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గిద్దలూరు మండల న్యాయ సేవాధికారి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గిద్దలూరు కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ ఓంకార్ అధ్యక్షతన క్రిష్టంశెట్టిపల్లి బీమలింగేశ్వరస్వామి దేవస్థాన ఆవరణంలో న్యాయ సేవా శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎ భారతి పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీస్ శాఖ, గిరిజన శాఖ, అటవీ శాఖ, పురపాలక శాఖ, రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ, మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో గిరిజనుల దీర్ఘకాలిక సమస్యలు హక్కుల పరిరక్షణ చట్టాల పర్యవేక్షణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని ఆమె అన్నారు. నల్సా పథకం 2015 అమలులో భాగంగా అన్ని విద్యాలయాలలో విద్యార్థులకు లీగల్ ఎయిడ్ క్యాంప్‌లు ఏర్పాటు చేసి బాలల హక్కులు వారి రక్షణ కోసం ఉన్న చట్టాలపై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న వ్యవస్థలపై అవగాహన కలిగించారు. సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల సేవలు గురించి వివరించారు. ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందకపోయినా ఎలాంటి సేవలకైనా న్యాయ సేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకొనిన ఎడల వారికి సత్వరమే న్యాయం చేస్తామని నల్సా పథకాలు, సేవలపై అవగాహన కలిగించారు. గిద్దలూరు కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ఓంకార్, గిద్దలూరు కోర్టు అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి శ్రీ కె భరత్‌చంద్ర గిరిజనుల చట్టాలపై అవగాహన కలిగించారు. ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల సేవలు గురించి వివరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రకాశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ భారతి గిరిజనులకు దుప్పట్లు, చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిఎన్ శేషశయనారెడ్డి, ఏ తిరుమలప్రసాద్, తహశీల్దార్ ఆంజనేయరెడ్డి, గిద్దలూరు అర్బన్ సీఐ కె సురేష్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్ ఇవి రమణబాబు, మార్కాపురం డివిజన్ ప్రభుత్వ అధికారులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు జిల్లా మండల న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చిన్నారులకు బుక్, పెన్ను అందిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ భారతి

'శ్రీశైలం'ను వివాదాల్లోకి లాగొద్దు

(మొదటిపేజీ తరువాయి)

మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు. శ్రీశైలాన్ని మార్కా పురంలో కలపాలన్న ప్రతిపాదన లేదన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి వస్తున్న ప్రతిపాదనలపై మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ విషయమై ప్రజలు ఆందోళన చెందొద్దన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఈ అంశంపై ఎవరూ మీడియాలో దుష్ప్రచారం చేయవద్దని మంత్రి తెలిపారు.

రైతులను సంక్షోభం నుంచి బయటకు తెచ్చేలా పొగాకు కొనుగోలు చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రైతులను బయటికి తెచ్చే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సంక్షోభంలో ఉన్న బ్లాక్ బర్లీ పొగాకు రైతులను ఆదుకోవడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. పొగాకు రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు.ఈ పాటికే కొనుగోలు చేసిన పొగాకును ప్రాసెసింగ్ చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. కలెక్టర్ వెంకట మురళి మురళి మాట్లాడుతూ బ్లాక్ బర్లీ పొగాకు కొనుగోలు సెప్టెంబర్ లోపు పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో 42 పొగాకు కొనుగోలు కేంద్రాల ద్వారా 9,900 టన్నుల బ్లాక్ బర్లీ పొగాకును కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 6,396 మంది రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. రైతులు అధైర్య పడవద్దని, వారికి అవగాహన కల్పిస్తూనే పొగాకు కొనుగోలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. ప్రతిరోజు 300 మంది రైతుల నుంచి 600 టన్నులు పొగాకును కొనుగోలు చేయడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయం, స్ఫూర్తితో పనిచేయాలన్నారు. ఈ సంవత్సరం పొగాకు సాగు నిషేధం విధించినందున ఒక్క మొక్క సాగులో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన బ్లాక్ భర్లీ పొగాకు నిల్వ చేయడానికి 18 వ్యవసాయ మార్కెటింగ్ శాఖ గోదాములను గుర్తించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆ గోదాములలో పొగాకు నిల్వ చేయడానికి 1.37 లక్షల చదరపు అడుగుల సామర్థ్యం ఉందన్నారు. పర్చూరు, యద్దనపూడి, ఇంకొల్లు, అద్దంకి మండలం తమ్మవరం, కొరిశపాడులోని గోదాములు నిండాయన్నారు. నిండిపోయిన గోదాముల నుంచి పొగాకును తక్షణమే తరలించాలని ఆదేశించారు. కొనుగోలు సమయంలో లోపాయి కారి ఒప్పందాలతో రైతులను ఇబ్బందులు పెడితే ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఆర్‌జెడి కె.శ్రీనివాసరావు, ఆర్‌డిడి ఎం.దివాకర్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి కె.రమేష్ బాబు, మార్క్ ఫెడ్ జిఎం కరుణశ్రీ, బాపట్ల ఆర్‌డిఒ పి.గ్లోరియా పాల్గొన్నారు.

శకుంతలను సత్కరిస్తున్న ఎంపీడీవో తదితరులు

సీనియర్ అసిస్టెంట్ శకుంతలకు సత్కారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఏ శకుంతల బదిలీపై వెళుతున్న సందర్భంగా ఎంపీడీవో డి సురేష్‌బాబు కార్యాలయ సిబ్బంది దుశ్శాలువాతో సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా శకుంతల మూడు సంవత్సరాల పాటు పని చేశారు. ఆమె పర్చూరు మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏ.ఓ)గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్ గా శకుంతల చేసిన సేవలను ఎంపీడీవో సురేష్‌బాబు తదితరులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వాసంతి, మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షులు ఎన్.ప్రతాప్ కుమార్, ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ విద్యార్థులు

ఎస్ఎఫ్ఐ విద్యా పరిరక్షణ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-మార్కాపురం: విద్యా పరిరక్షణ యాత్ర మార్కాపురంలోని మెడికల్ కాలేజీ వద్దకు శనివారం చేరుకుంది. బృందం నాయకులు మెడికల్ కాలేజీని పరిశీలించి అనంతరం మాట్లాడుతూ జిల్లా వెనుకబాటు తనం నుంచి పశ్చిమ ప్రకాశాన్ని అభివృద్ధి చేయాలంటే ప్రకాశం జిల్లాలో వెనుకబడిన ప్రాంతాలైన యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాల ప్రజల విద్య, వైద్యం అవసరాన్ని తీర్చే మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం ఆపకుండా, ప్రైవేటుకు ఇవ్వకుండా ప్రభుత్వమే బాధ్యత తీసుకొని నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు చేరుకోవాలంటే మార్గం మధ్యంలోనే ప్రాణాలు వదిలేస్తున్నారు. ప్రైవేటు వైద్యం ఖరీదు కావడంతో పేదలు అనారోగ్యాలతో మగ్గుతున్నారు. మెడికల్ కాలేజీ వస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందుతుంది. ఇంతటి అవకాశాలు కలిగిన మెడికల్ కాలేజీని ప్రైవేటుపరం చేయాలని ప్రభుత్వం ఆలోచించడాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. యాత్రలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి, జిల్లా నాయకులు కె విజయ్, ఎస్ అరుణ్, గంగాంజి, నాగరాజు, ఆనంద్, దాసు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న నాసరరెడ్డి

సొసైటీ అధ్యక్షుడిగా నాసరరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలం మిట్టమీదిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా గొలమారి నాసరరెడ్డి శనివారం బాధ్యత లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకున్న విధం గా రుణాలు అందించేందుకు కృషి చేస్తాన ని చెప్పారు. అనంతరం టిడిపి నాయకులు నాసరరెడ్డిని అభినందించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు దుకాణాల రూపంలో అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని యర్రగొండపాలెం ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొంతమంది వ్యక్తులు నిబంధన లను ఉల్లంఘిస్తూ బహిరంగంగా మద్యం విక్రయా లకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ అక్రమ చర్యలను అరికట్టేందుకు విస్తృత స్థాయిలో దాడులు చేపడుతున్నామని వివరించారు. గత ఏడాది కాలంలో యర్రగొండపాలెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల్లో జరిగిన దాడులలో మొత్తం 42 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో 42 మందిని అరెస్టు చేసి 756 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. మూడు మండలాల పరిధిలోని దాబాలలో మద్యం విక్రయాలు జరిపిన వారిపై కూడా దాడులు నిర్వహించి ఐదు కేసులు నమోదు చేశామని ఆయన తెలిపారు. గ్రామాల్లో విచ్చలవిడిగా పెరుగుతున్న బెల్టు దుకాణాలు ప్రజల ఆర్థిక పరిస్థితులను దెబ్బతీస్తున్నాయని, కుటుంబ సమస్యలు పెరుగుతున్నాయని సీఐ ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం అక్రమ విక్రయాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.

ఎక్సైజ్ సిఐ శ్రీనివాసులు

CHANGE OF NAME

I,PATANMAHABOOBKHAN FIROZ KHAN (Old Name) S/o.MAHABU KHAN
Resident of D.No.2-14/2,Inkollu Village, Post and Mandal, Prakasam District-523167, Andhra Pradesh.
I have chaged my name as
PATAN FIROZ KHAN (New Name)
S/o.MAHABU KHAN
Hence after my name is known as
PATAN FIROZ KHAN (New Name)
S/o.MAHABU KHAN
will be applicable for all purpose

పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్ పోయినది

ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన కోడూరి రమణ తండ్రి నాగేశ్వరరెడ్డి లకు చెందిన పదవ తరగతి ఒరిజినల్ మార్క్‌లిస్ట్ రిజిస్టర్ నెంబర్ 2216131780, అడ్మిషన్ నెంబర్ 137 కనిగిరి నుండి కొట్టాలపల్లికి 25-07-2025 తేదీన బస్సులో బయలుదేరి వస్తుండగా కింద జారి పడిపోయినది ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

మా చిరునామా
కోడూరి రమణ, తండ్రి నాగేశ్వరరెడ్డి
కొట్టాలపల్లి పోస్టు,వెలిగండ్ల మండలం,
ప్రకాశం జిల్లా, పిన్: 52 32 23
సెల్ నెంబర్:8179914005, 8978556275.

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) కోర్టు బాపట్ల .
ఐ.పి. నం: 12/2025.

బిట్వీన్ :
1. షేక్ అబ్దుల్లా S/o మస్తాన్
2. షేక్ దిల్ షాద్ W/o అబ్దుల్లా .
పై 1,2 పిటిషనర్ల నివాసము 3.D-159/B3 భావపురి కాలనీ, 24 వవార్డు, బాపట్ల, బాపట్ల జిల్లా .... పిటిషనర్స్ .

వర్సెస్
1 ఓరగంటి ఉషారాణి W/o గోపాలకృష్ణారెడ్డి పాత కరెంట్ ఆఫీస్ ఎదురు, పసుపు వాళ్ళ బజారు, బాపట్ల, బాపట్ల జిల్లా .
2 షేక్ చాంద్ బి, W/o రహిమాన్, భావపురి కాలనీ, బాపట్ల, బాపట్ల జిల్లా .
3 షేక్ హుస్సేన్ బి W/o షాబ్ జర్ అలీ, భావపురి కాలనీ, బాపట్ల, బాపట్ల జిల్లా.
4 అఫీషియల్ రిసీవర్ జిల్లా కోర్టు ప్రాంగణం గుంటూరు, గుంటూరు జిల్లా .... రెస్పాండెంట్లు.

పై నంబరు ఐపీలో పిటిషనర్లు రెస్పాండెంట్లపై ఇన్సాల్వెన్సీ పిటీషను దాఖలు చేయగా సదరు కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం 17-9-2025వ తేదీన వాయిదా ఆర్డర్ వేసినారు. సదరు వాయిదా తేదీన పైకోర్టు వారి ఎదుట ఉదయం 10 :30 నిమిషములకు పైన ఎవరికైనా ఎటువంటి ఆక్షేపణలు ఉన్న యెడల స్వయంగా గాని లేదా ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తమఆక్షేపణలు తెలియ జేయగలరు లేనియెడల మీపరోక్షమున తీర్మానించ బడును.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు//
వాయిదా: **17-9-2025**

ఇట్లు
తాతా వెంకటేశ్వరరావు, B.Sc,MA,ML.
పిటిషనర్ల తరపు న్యాయవాది, బాపట్ల.
సెల్ నెం:9948250582.

మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No : 342/2020

సూరెకల్లు కోటిరయ్య .. వాది
వర్సస్
ఇల్లూరి చెంచిరెడ్డి చనిపోతే ఆయన వారసులు ఇల్లూరి అంకమ్మ వగైరాలు..ప్రతివాదులు

To

2వ ప్రతివాది (భార్య)
ఇల్లూరి అంకమ్మ భర్త లేట్ చెంచిరెడ్డి, హిందూ, వ్యవసాయం, వయస్సు సుమారు 70 సం.లు, నివాసం క్రిష్టంశెట్టిపల్లె గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా, ఏపీ స్టేట్.

3వ ప్రతివాది (కుమార్తె)
యనుముల వరలక్ష్మి భర్త అంకిరెడ్డి తండ్రి ఇల్లూరి చెంచిరెడ్డి(లేట్), హిందూ, గృహిణి, వయస్సు సుమారు 50 సం.లు, నివాసం రామాపురం గ్రామం, రాచర్ల మండలం, ప్రకాశం జిల్లా, ఏపీ స్టేట్.

4వ ప్రతివాది
పుష్పలత భర్త వెంకట రెడ్డి, హిందూ, గృహిణి, వయస్సు సుమారు 46 సం.లు, నివాసం వరలక్ష్మీపురం గ్రామం, పొదిలి మండలం, ప్రకాశం జిల్లా, ఏపీ స్టేట్.

5వ ప్రతివాది
ఇల్లూరి వెంకటేశ్వరరెడ్డి తండ్రి లేట్ ఇల్లూరి చెంచి రెడ్డి, హిందూ, వయస్సు సుమారు 40 సం.లు, వ్యవసాయం, నివాసం క్రిష్టంశెట్టిపల్లె గ్రామం, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా, ఏపీ స్టేట్.

పై నెంబర్ దావాలోని వాది మీ వగైరాలపై దావా ప్లయింటు పరిహారం కోరుతూ దావాను దాఖలు చేసినందున, సదరు దావాలో మీరు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుటకు వాయిదా 04-09-2025 వ తేదీ యున్నది. మీరు వాయిదా రోజు ఉదయం 10.30 నిమిషాలకి మీరు స్వయంగా గాని, లేదా మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలుంటే తెలుపుకునేది. లేనిచో మీ పరోక్షమందు దావా విమర్శించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేదీ: **04-09-2025**

ఇట్లు
శ్రీ బి.డి గిరి
శ్రీ తురగా ఈశ్వర అంజనీకుమార్.
వాది తరపు అడ్వకేట్స్,
గిద్దలూరు.

ప్రజాశక్తి
ఆదివారం 31 ఆగస్టు 2025

భూసేకరణే కీలక ఎజండానా...

పోర్టులు..ఎయిర్‌పోర్టులు..పవర్‌ప్లాంట్లు..ప్రైవేట్ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణకు సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. దీనిపై వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. వీడియో సమావేశం ఉద్దేశమంతా రైతుల భూములను సేకరించాలన్న దానిపైనే సాగడం గమనార్హం. అంటే రానున్న కాలంలో రాష్ట్ర ప్రభుత్వ కీలక ఎజండా భూసేకరణేనని విధితమవుతోంది. రైతులు సాగుచేసుకునే భూమికి మళ్లీ ఎసరు వచ్చింది. కూటమి పార్టీలు ఎన్నికలకు ముందు చెప్పినవాటిని పక్కనబెట్టేశాయి. జిల్లాలో కీలకమైన ఏప్రాజెక్టు కూడా ముందుకు సాగడంలేదు. కొత్తగా తెరపైకి అనేకం వస్తున్నాయి. కరేడులో ఇండోసెల్ కంపెనీకి భారీగా భూమి అప్పగిస్తున్నారు. రైతులతోపాటు గిరిజనులు కూడా బాధితులుగా ఉన్నారు. అందరూ పోరాడుతున్నారు. ఇపుడు కొత్తగా చేపట్టేవాటికి భూములు సేకరించాల్సి ఉంది.కీలక అవసరాలకు ఇబ్బంది లేదు.ప్రభుత్వం తరుపున ఉండే ప్రాజెక్టులకు భూమి సేకరించిన పర్వాలేదు. ప్రైవేటు సంస్థలకు అప్పగించాలన్నదే ప్రధాన ఉద్దేశంగా ఉంది. గతంలో అప్పగించిన వేలాది ఎకరాల భూములు వృథాగానే ఉన్నాయి. వాన్‌పిక్‌కోసం సేకరించిన భూములు అన్నీ కోర్టు వివాదాల పేరుతో నిరుపయోగంగానే పడిఉన్నాయి. ఒక్కపరిశ్రమ రాలేదు. రైతుల నుంచి బలవంతంగా ఆనాడు సేకరించి ఇచ్చారు. మళ్లీ తీరప్రాంతంలో విమానాశ్రయం కోసం 650 ఎకరాలకుపైగా భూమి ఇపుడు సేకరించాల్సి ఉంది. దీంతోపాటు హార్బర్ కోసం కొంత భూమి అవసరం ఉంటుంది.ఇవన్నీ ప్రభుత్వ ఆధీనంలో ఉండేవి.కొత్తగా ప్రాజెక్టులు పెడతామని అర్జీపెట్టుకున్న ప్రైవేటు సంస్థలకు భూమిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. దొనకొండ, కనిగిరి వద్ద వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిల్లో ఒక్క ప్రాజెక్టు పెట్టడం లేదు. ఏదేమైనా రానున్నకాలంలో రైతుల భూములకు ఎసరు తప్పదనిపిస్తోంది.

జిల్లా విభజనపై మంత్రుల కమిటీ పర్యటిస్తుందని సమాచారం వారం క్రితమే అందింది. ఈనెల 30న ఇద్దరు మంత్రులు వస్తున్నట్లు వారం క్రితం షెడ్యూల్ కూడా విడుదల చేశారు. మీడియాలోనూ వచ్చింది. అయితే 30న రావాల్సిన మంత్రులు ఇద్దరూ రాలేదు. జిల్లాల పేర్ల మార్పులు, సవరణలు, కొత్త జిల్లాల ఏర్పాటుపై ఈ కమిటీ ప్రజల అభిప్రాయాలు సేకరించాలి. నెలరోజుల్లో నివేదిక ఇవ్వాలని సిఎం చంద్రబాబు ఆదేశించారు. ఆయన ఆదేశించి నెల కావస్తోంది.ఇంత వరకూ కమిటీ రానే రాలేదు. అభిప్రాయాలు తీసుకోలేదు.కమిటీ వస్తుందని వివిధ పార్టీల నేతలు కూడా సిద్ధంగా ఉన్నారు.అయితే అంతా నిరాశేనన్నట్లుగా ఉంది. జిల్లా అధికారులను అడిగితే ఎలాంటి సమాచారం రాలేదని చెబుతున్నారు. కమిటీలు కాలయాపనకేనని మరోసారి విధితం చేశారు.

పొగాకు మార్కెట్ ఆఖరు దశలో స్వల్పంగా ధరలు పెంచారు. నోబిడ్స్ కొనసాగుతున్నాయి. ఇప్పటికీ 25శాతం బేళ్లను వెనక్కుపంపుతున్నారు.రైతులు ఆఖరు దశలోనూ అవస్థలు పడుతున్నారు.వేలం ముగిసే దశలో కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.301కు పెంచారు.ఇది కూడా ఒంగోలులోని ఓ కేంద్రంలోనే. మిగతాచోట్ల రూ.292 ఇస్తున్నారు. రైతులు పోరాడి పోరాడి విసుగెత్తిపోయారు. నిలువునా దోపిడీకి గురయ్యారు. ఈఏడాది నోబిడ్స్‌తోనే రైతులను ఇబ్బంది పెట్టారు. అమ్ముకోవడానికే ఇబ్బందులు పడ్డారు. ధరలు అడిగే అవకాశం కూడా లేకుండా చేశారు. పదిబేళ్లు తీసుకుపోతే నాలుగు బేళ్లను తిరిగి అదే ట్రాక్టర్‌లో వేసుకుని ఇంటికి తెచ్చుకున్నారు. సీజనంతా ఇదే జరుగుతోంది.దీనిపై పాలకపక్ష నేతలు ఎవరూ అడిగే పరిస్థితి లేదు. కేంద్రాల్లో తనిఖీలు తప్ప ఆచరణలో ధరలు పెంచే చర్యలు లేవు.ప్రతిపక్షపార్టీలు వేలం కేంద్రాలను సందర్శిస్తే వాళ్లపై కేసులు పెట్టారు. పొగాకు రైతులను దగా చేస్తున్న వ్యాపారులపై వత్తిడి లేదు.పూర్తిగా వదిలేశారు.రైతులకు నష్టాలే మిగిలాయి.

యూరియా ఇపుడు పెద్ద చర్చగా మారింది.కేంద్ర రాష్ట్రాలకు సకాలంలో యూరియాను సరఫరా చేయడంలో తలెత్తిన వైఫల్యం రైతులకు శాపంగా మారింది. యూరియా కొరత వచ్చిందనే ప్రచారం రైతుల్లో కలకలం రేపింది. దీంతో అవసరం ఉన్నా లేకున్నా ఎగబడుతున్నారు. ముందు జాగ్రత్తపడుతున్నారు. మరోవైపు వరినాట్లు ముమ్మర మవుతున్నాయి. యూరియా అవసరం వచ్చింది. వెంటనే అధికారులు మేల్కొని యూరియాతోపాటు ఇతర ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలి.ప్రస్తుతం జిల్లాలో దీనికోసం రైతులు క్యూల్లో ఎక్కడా కనిపించడం లేదు.ఎందుకంటే అవసరం లేక కాదు. ఖరీఫ్‌తోపాటు రబీ సీజన్ మనకు నెలరోజులు ఆలస్యంగా మొదలవుతుంది. ఇపుడు అవసరం వచ్చింది.అందుబాటులో ఉంచాలి.

ఈ వారంలో ఒంగోలులో సిపిఐ రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఆపార్టీ జాతీయ నేతలు ఒంగోలు వచ్చారు. అదే విధంగా ట్రాన్స్‌పోర్టు కార్మికుల రాష్ట్ర మహాసభతోపాటు గొర్రెలపెంపకం దార్ల రాష్ట్ర మహాసభలు కూడా జరిగాయి. జాతీయ, రాష్ట్ర నేతలు ఒంగోలుకు రావడం విశేషం.

కులం పేరుతో దూషించారని నిరసన

స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దళితులు

ప్రజాశక్తి-పామూరు

గణేష్ నిమజ్జనాన్ని అడ్డుకొని దళితులపై దౌర్జన్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.మాల్యాద్రి అన్నారు. శనివారం సిఐ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూర్పుకట్టకిందపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ పాలెంలో దళితులు గణేష్ నిమజ్జనానికి బొట్ల గూడూరుకు వైపు వెళుతున్న సమయంలో బాణాసంచా కాలుస్తూ అంబేద్కర్ పాటలు పెట్టుకున్నారన్నారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన నీరుకట్టు నారాయణస్వామి నీరు కట్టు లక్ష్మీనారాయణ, నీరుకట్టు నవీన్, కోవూరు శ్రీహరి, నీరుకట్టు మనోహర్, నీరుకట్టు శ్రీనివాసులు, పల్లెకొండ మాధవరావు, మరికొందరు ట్రాక్టర్లను అడ్డుకొని కులం పేరుతో అసభ్యంగా తిడుతూ.. అంబేద్కర్ పాటలు, టపాసులు మా దగ్గర కాలుస్తారా అంటూ భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కులం పేరుతో దూషించిన అవమానాలకు గురి అవుతున్నారని ఏన్ని చట్టాలు ఉన్నా నేటికి దళితులను, గిరిజనులను అంటరాని వారిగా పాటిస్తున్నారని, అట్టి వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. దళితుల గిరిజన చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో దళితులు పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. విచారించి న్యాయం చేస్తానని పోలీసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల్యాద్రి, వెంగయ్య, నాగేశ్వరరావు, ఎం.రాజు, గురవయ్య, శివరాములు, శ్రీనివాసులు, రమేష్, రవికుమార్, రామకృష్ణ, మాలపాటి వీర నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బదిలీ వెనుక మర్మమేమి..?

రాత్రికి రాత్రే మార్పుతో మండలంలో చర్చ

ఎమ్మెల్యేకు తెలియకుండానే జరిగిన వైనం

ప్రజాశక్తి-మద్దిపాడు

ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే ఎస్‌ఐ రాత్రికి రాత్రే వి ఆర్‌కు వెళ్లడం గంటల వ్యవధిల్లోనే కొత్త ఎస్‌ఐ బాధ్యతలు చేపట్టడం చకచక జరిగిపోయాయి. ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే కొత్త ఎస్‌ఐ రావడం అనే విషయం నాయకులకు తెలియడంతో అధికార పార్టీ నాయకులు ఖంగుతిన్నారు. అసలు ఎస్‌ఐ బదిలీకి కారకులు ఎవరు? ఏం జరిగిందో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

మొన్నటి వరకు మద్దిపాడు ఎస్‌ఐగా శివరామయ్య బాధ్యతలు చేపట్టారు. రెండు రోజుల కిందట గ్రోత్ సెంటర్ వద్ద అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న మూడు టిప్పర్లను పట్టుకున్నారు. అధికార పార్టీ నాయకులు తమ టిప్పర్లేనని విడిచిపెట్టమని ఎస్‌ఐని అడగ్గా పై అధికారులను అడగండి అని సమాధానం చెప్పారు. అనంతరం మైనింగ్ అధికారులు ఒక టిప్పర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. టిప్పర్లు పట్టుకున్న విషయంలో మండలంలో చర్చ జరగగా మరుసటి రోజే మద్దిపాడు స్టేషన్‌కు నూతన ఎస్‌ఐగా గంగుల వెంకట సైదులు బాధ్యతలు చేపట్టారు. కొందరు ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ మార్పు చేశాడని, అదే క్రమంలో టిప్పర్ల విషయంలో మంత్రి తాలుకు నాయకులతో ఎస్‌ఐ పెట్టుకోవడంతో ఈ బదిలీ జరిగిందని అందరూ అనుకున్నారు. కానీ ఎమ్మెల్యేకు తెలియదనే విషయం మండల నాయకులకు తెలియడంతో కంగుతిన్నారు.

సాధారణంగా అధికారుల బదిలీల విషయంలో స్థానిక నాయకులు ఎమ్మెల్యేను కలిసి తమకు అనుకూలంగా ఉన్న అధికారులను తెప్పించుకుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఎస్‌ఐ బదిలీ అవుతాడనే కనీసం సమాచారం ఎవరికీ లేదు. నూతన ఎస్‌ఐ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ విషయం బయటకు రావడంతో అసలు మండలంలో ఏం జరుగుతుందో అనే చర్చ మొదలైంది. తన ప్రమేయం లేకుండానే స్టేషన్‌కు కొత్త ఎస్‌ఐ వచ్చాడు అనే విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దీనిపై ఆరా తీసినట్లు సమాచారం. అందుకు కారకులు ఎవరు అనే దానిపై పూర్తి స్థాయి సమాచారం ఎమ్మెల్యేకు తెలిసిందనే వార్త వినిపిస్తుంది. ప్రస్తుతం ఈ విషయంపై ఎమ్మెల్యే బిఎన్ విజయ్‌కుమార్ ఏ విధమైన నిర్ణయం తీసుకుంటాడనే ఉత్కంఠత కూడా నెలకొంది. తమ స్వంత ప్రయోజనాలకు ఎస్‌ఐ శివరామయ్య సహకరించడం లేదనే కొందరు కావాలనే ఎస్‌పి దామోదర్‌కు తప్పుడు నివేదికలు ఇచ్చి రాత్రికి రాత్రే ఎస్‌ఐ మార్పునకు శ్రీకారం చుట్టారనే ప్రచారం జోరందుకుంది. ప్రస్తుతం దీనిపై మండల నాయకులు కూడా పెదవి విప్పడం లేదు. తరువాత పరిణామాలు ఎలా ఉంటాయో వేచి చూడాలి.

గోగులదిన్నెలో నాటు బాంబు కలకలం

పసుపువాటాత్తూ పేలడంతో శునకం మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

నాటు బాంబు పేలి శునకం మృతి చెందిన ఘటన మండల పరిధిలోని గోగులదిన్నె గ్రామంలో శనివారం చోటు జరిగింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఒక వీధి కుక్క నాటు బాంబును తన నోటితో పట్టుకొని తిరుగుతూ ఉంది. ఈ క్రమంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో గ్రామస్తులు వెళ్లి చూడగా బాంబు పేలి శునకం తల ఛిద్రమయి విగతజీవిగా పడి ఉంది. కాలనీలో నాటుబాంబు పేలడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. ఘటన గురించి సమాచారం అందుకున్న మార్కాపురం గ్రామీణ పోలీసులు గ్రామంలో నాటుబాంబు ఎక్కడి నుంచి వచ్చింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా రైతులు పొలాల్లో అడవి పందులను హతమార్చేందుకు వినియోగిస్తున్నారా లేక ఇంకేదైనా అసాంఘిక కార్యకలాపాల కోసం ఇక్కడికి తీసుకొని వచ్చి భద్రపరిచారా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

రూ.39 వేలు నగదు చోరీ

ప్రజాశక్తి-మార్కాపురం : మార్కాపురం ఆర్‌టిసి బస్టాండులో ఓ మహిళ వద్ద కర్రల సంచికలో ఉన్న రూ. 39వేల నగదును గుర్తు తెలియని మహిళ అపహరించింది. పెద్దారవీడు మండలం బి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కోలగట్ల రమాదేవి తన కుమార్తెను ఒంగోలులోని కాలేజీలో వదిలిపెట్టేందుకు బయలు దేరింది. కాలేజీలో ఫీజు చెల్లించేందుకు రూ.39వేలు కర్రల సంచిలో పెట్టుకొని, పైన కండువా కప్పింది. ఒంగోలు బస్సు కోసం వేచి ఉన్న సమయంలో గుర్తు తెలియని మహిళ ఆ సంచికలో ఉన్న నగదును కొట్టేసింది. దీంతో బాధిత రాలు రమాదేవి లబోదిబోమంది. ఆర్‌టిసి బస్టాండులోని సిసి పుటేజీలను ఆర్‌టిసి అధికారులు పరిశీలించారు. ఈ మేరకు కోలగట్ల రమాదేవి మార్కాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎం.సైదుబాబుకు ఫిర్యాదు చేశారు.

గనిలో జారిపడిన మట్టి పెళ్లలు

కార్మికులు లేకపోవడంతో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-చీమకుర్తి : రామతీర్థం సమీపంలోని మిడ్‌వెస్ట్ గ్రానైట్ గనిలో ప్రమాదం తప్పింది. శుక్రవారం రాత్రి 9:30 గంటల సమయంలో గనిలో పనిచేస్తున్న కార్మికులు భోజనానికి గని నుంచి పైకి వెళ్లారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల తడిసిన క్వారీ క్రిందికి జారింది. ఆ సమయంలో కార్మికులు భోజనానికి వెళ్లడంతో ప్రమాదం తప్పింది. కొంత మేర మిషనరీ దెబ్బతింది. క్వారీ యాజమాన్యం, కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు. శనివారం సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రానైట్ గనులలో ప్రమాదాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. క్వారీ యాజమాన్యాలు తగిన నిబంధనలు పాటించకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనింగ్ అధికారుల నిరంతర పర్యవేక్షణ లేకపోవడం ప్రమాదాలు కారణమవు తున్నాయన్నారు. మైనింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేసే విధంగా మైనింగ్ కార్యాలయం ఒంగోలులో పెట్టాలని కోరారు.

ప్రశ్నించినందుకు పని నుంచి తొలగించారు..!

ఆర్టీసీ డిపోలో కాంట్రాక్టు సూపర్‌వైజర్ నిర్వాకం

కార్మికుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న వైనం

ప్రజాశక్తి-పీసీపల్లి, కనిగిరి

అవినీతిని ప్రశ్నిస్తే పని నుంచి తొలగిస్తున్నాడు.. ఇదేం న్యాయం అంటూ నిలదీసేందుకు సిద్ధపడితే వారిని నానా ఇబ్బందులు పెడుతున్నాడు.. చాకిరీ ఎక్కువైనప్పటికీ నామమాత్రము వేతనం చెల్లిస్తూ అందులో కొంత తిరిగి వసూలు చేస్తున్నాడు. నెలవు రోజుల్లో కూడా పని చేయించి కార్మికుల ఖాతాలో డబ్బులు జమ చేసి తిరిగి వసూలు చేసుకుంటున్నాడు. ఇది కనిగిరి ఆర్టీసీ డిపో గ్యారేజీలో సూపర్వైజర్‌గా పనిచేస్తున్న దమ్ము శ్రీనివాసులు నిర్వాకం.

కనిగిరి ఆర్టీసీ డిపోలో గ్యారేజ్‌లో 21 మంది కాంట్రాక్టు కార్మికులు స్వీపర్, వాషింగ్, మ్యాపింగ్ లాంటి పనులు చేస్తుంటారు. వీరందరినీ ఒక కాంట్రాక్టర్ ద్వారా నియమించారు. సూపర్వైజర్ అవినీతిని ప్రశ్నించిన కార్మికులందరినీ ఒకేసారి కాకుండా అప్పుడప్పుడు తొలగిస్తూ తన నైజాన్ని బయట పెట్టుకున్నాడు. ఇప్పటికి 8 మంది కార్మికులను పనులను తొలగించాడు. 2019 నుంచి 21 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి

డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తున్న సిఐటియు నాయకులు

కాంట్రాక్టు పద్ధతిలో నెలకు రూ.10,383 చెల్లించాలి. వీరికి నెలకు నాలుగు సెలవులు ఇస్తారు. కానీ ఇక్కడ అవేమి అమలు జరగవు. నెలకు నాలుగు సెలవులు ఉన్నప్పటికీ నెలంతా పని చేయించుకొని ఇచ్చే జీతం కార్మికుల ఖాతాలో రూ.10383 జమ చేయించి వీటిలో రూ.383 తిరిగి వసూలు చేస్తాడు. వీటితోపాటు ఉన్న నాలుగు రోజులు సెలవుల్లో పని చేయించి అవి కూడా కార్మికుల ఖాతాలో వేసి వాటిని కూడా అతనే తీసుకుంటాడు. చీమలదిన్నె గురవయ్య అనే కార్మికుడు మే నెలలో పని చేయలేదు. జూన్ నెలలో గురవయ్య ఖాతాలో జమ చేసి మొత్తం తిరిగి ఇవ్వమని తీవ్రంగా ఒత్తిడి చేసి డబ్బులు ఇవ్వనందుకు పని నుంచి తొలగించాడు. ఒక షిఫ్ట్‌లో రోజుకు ఐదుగురు పని చేయాల్సి ఉండగా కేవలం ఇద్దరు, ముగ్గురి చేత పని అంతా చేయించుకొని శ్రమ దోపిడీ చేస్తున్నాడు. వేతనాలు మాత్రం ఐదుగురు పని చేసినట్టు ఖాతాల్లో జమచేసి తిరిగి రాబట్టుకుంటాడు. ఈ విధంగా సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసులు కార్మికులపై తన జులుం చూపించి ఆక్రమంగా వసూలు చేస్తున్నాడు.

మేనేజర్‌కు ఫిర్యాదు చేసిన సిఐటియు నాయకులు

ఆర్టీసీ డిపోలో కార్మికులపై అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమంగా తొలగించిన 8 మందిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా నాయకులు పిసి కేశవరావు ఆధ్వర్యంలో శనివారం డిపో మేనేజర్ సయానా బేగంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవ మాట్లాడుతూ విధుల నుంచి తొలగించిన ఎనిమిది మందిని వెంటనే విధుల్లో చేర్చుకోవాలని, సూపర్‌వైజర్ అరాచకాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అడివయ్య, ప్రసాద్, ఇమ్మానుయేలు, నాగేంద్ర, దేవిడ్, సిఐటియు నాయకులు నరేంద్ర తదితరులు ఉన్నారు.

నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలలోని యనమదల మెయిన్ అంగన్‌వాడీ కేంద్రానికి నూతనంగా ఎంపికైన కార్యకర్త, సూరవరపుపల్లి అంగనవాడీ కేంద్రానికి సహాయకు రాలుకు తన క్యాంపు కార్యాలయంలో నియామకపత్రాలు పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా శనివారం అందజేశారు. నియోజకవర్గంలో కొత్తగా ఎన్నిక కాబడిన ఇద్దరూ కార్యకర్తలు, 8 మంది సహాయకులకు అపాయింట్మెంట్ ఆర్డర్ అందజేశారు. పర్చూరు ప్రాజెక్ట్ పరిధిలో ఒక కార్యకర్త, ఆరుగురు సహాయకులు ఎన్నిక కాబడ్డారు. మండలంలో యనమదల మెయిన్ అంగన్‌వాడి కేంద్రం, సూరవరపుపల్లె ఎస్సీ అంగన్‌వాడి కేంద్రాలకు ఇద్దరు సహాయకురాలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యద్దనపూడి సూపర్ వైజర్ సిహెచ్ సుజాత, నూతనంగా ఎంపికైన అభ్యర్ధులు, ఐడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం పరిశీలిస్తున్న చైర్మన్ మించాల సాంబశివరావు

స్థల పరిశీలన

ప్రజాశక్తి - చీరాల

ప్రజలు చిరకాల కోరికైన గడియార స్థంభం నిర్మాణంకు శాసన సభ్యులు కొండయ్య ఆధ్వర్యంలో టిడిపి అధికార ప్రతినిధి సూచనలతో అతిత్వరలో గడియార స్థంభం సెంటర్లోనే గడియారం స్థంభం నిర్మాణం చేపట్టి ప్రజలకు అంకితం చేస్తామని చైర్మన్ మించాల సాంబశివరావు తెలిపారు. గడియార స్థంభం సెంటర్లో స్థలం టిపిఒ శ్రీనివాస్, సర్వేయర్ గోపికృష్ణ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

హెచ్‌ఎం అరుణ కుమారిని అభినందిస్తున్న ఎంఇఒ లాజర్

పాఠశాలకు బెంచీలు బహూకరణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని పెదపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు పాఠశాల పూర్వపు విద్యార్థులైన కొక్కిలిగడ్డ చలమయ్య, బుల్లెమ్మ కుమారులు కొక్కిలిగడ్డ పున్నారావు, రవీంద్ర బాబు సహాయంతో రూ.20 వేల విలువైన రెండు బల్లలు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం జి ప్రసాద్ తెలిపారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని మొలకలూరుకు చెందిన త్రివర్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పొందుగుల వెంకటేశ్వరరావు సహకారంతో రూ.20వేల విలువైన మరో రెండు బల్లలు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ పి లాజర్, వెల్టూరు క్లస్టర్ హెచ్‌ఎం అరుణ కుమారిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి పావని పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ ఎమ్మెల్యే తనయుడు మద్దులూరి మహేంద్ర నాథ్ ప్రారంభించారు. ఎఎంసి చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, పిఎసిఎస్ చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, కొత్త నాగరాజు, ధోగుపర్తి బాలకృష్ణ, దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు పివి సుబ్బారావు, అందె రవికుమార్ పాల్గొన్నారు.

చెరువు సమస్యపై తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని కొనికి పంచాయితీ కట్టావారిపాలెం, నలతోటివారిపాలెం దళితులు తహశీల్దారు వివిఎస్ శ్రీనివారావుకు మంచినీటి చెరువు సమస్యపై శనివారం వినతి పత్రం అందజేశారు. శీతల తీర్థంగా యజమానులు అక్ర మంగా వేస్తున్న పైపులైన్ ఆపాలని వినతిపత్రం ఇచ్చారు. కట్టావారిపాలెం, నల్లతోటివారిపాలెం గ్రామాలకు రామ య్య కుంట మంచినీటి చెరువు ఉన్నది. దళితులు ఆ చెరువు నీళ్లే మంచినీళ్లుగా వాడుకుంటున్నారు. ఆ నీటిని గ్రామం పక్కనే ఉన్న కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం దళితుల భూముల్లో నుండి యంత్రాలతో కాలువ తవ్వి నీటి కోసం పైపులైన్ ఏర్పాటు చేస్తున్నారు. అది గమనించిన రెండు గ్రామాల దళితులు ఇలా చేయటం ఏమిటని యాజమా న్యాన్ని అడుగగా

వినతి పత్రం అందజేస్తున్న దళితులు

తమకు ప్రభుత్వ అధికారులు వేసుకోమని అనుమతి ఇచ్చారని, తాము పనులు ఆపేది లేదని మొండిగా చెబుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయం పంచాయతీ సెక్రెటరీ అడ్డగడ్డ వెంకటేశ్వర్లు కు తెలుపగా తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపి నట్లు తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ ఎఈని ఫోన్ ద్వారా సంప్ర దించగా విషయం తమకు తెలియదని, తాము ఎలాంటి అనుమతి ఇవ్వలేదని అన్నారని తెలిపారు. కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం ఎవరి మాట వినకుండా మొండిగా పనులు చేస్తున్నారని తెలిపారు. గ్రామాలు అనుకుని కొత్తగా కెమిక ల్ ఫ్యాక్టరీ పెట్టడానికి చూస్తున్నారని తెలిపారు. దాని వలన కలుషిత నీళ్లు వచ్చి పొలాలు కాలుష్యమై ప్రజలు ఇబ్బందులు పడతారని, ఉన్నతాధి కారులు స్పందించి కోల్డ్ స్టోరేజీ పైపు లైన్లను, కెమికల్ ఫ్యాక్టరీని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, నలతోటి భాను ప్రసాద్, పావులూరి జాన్సన్, పిచ్చయ్య, పావులూరి ఆనం దరావు, కట్టా రవికుమార్, కట్టా లాజరు, కట్టా రమేష్, కట్టా చంద్రశేఖర్, పావులూరి సింగయ్య, కట్టా సుందర్రా

త్వరలో హెచ్‌డిసి పునర్నిర్మాణం

- జిజిహెచ్‌కు ఫ్రీజర్ అందజేత
- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ (హెచ్‌డిసి)ని త్వరలో పున :నిర్మాణం చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. డాక్టర్ సింగు విజయ రాఘవరావు హీమోఫీలియా రోగులకు కోసం ఇచ్చిన ఫ్రీజర్‌ను ఆయన శనివారం జిజిహెచ్ వైద్యు లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ రాఘవరావు ఫ్రీజర్ బహూకరించటం తోపాటు మౌలిక సదుపా యాల కల్పనకు పూనుకోవటం అబినందనీయమని అన్నారు. ఈపాటికే వివిధ సందర్భాల్లో జిజిహెచ్‌కు అవసరమైన స్ట్రెచర్లు, వీల్‌చైర్స్ అందించామని తెలిపారు. త్వరలో రోగుల కోసం పెద్ద సంఖ్యలో బల్లలు సమకూరుస్తామని తెలిపారు. జిజిహెచ్‌లో సౌకర్యాల కల్పనకు దాతలు ముందుకు రావాలని కోరారు. జిజిహెచ్ అభివృద్ధి కమిటీ పున నిర్మాణం త్వరలో జరుగుతుందని

ఫ్రీజర్ బహుకరణలో పాల్గొన్న ఎంఎల్ఎ దామచర్ల

తెలిపారు. కొత్త సభ్యుల పేర్లు ప్రతిపాదించామని అన్నారు. త్వరలో జిజిహెచ్ (హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ) సమావేశం నిర్వహిస్తామన్నారు. డాక్టర్ విజయ రాఘవరావు మాట్లాడుతూ హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు మందుల నిల్వ కోసం ఫ్రీజర్‌ను ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతిరెడ్డి, సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ మాధవీలత, డిప్యూటీ ఆర్ఎంఒ



వినతిపత్రం అందజేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి - పంగులూరు

పంచాయతీల్లో పనిచేసే గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు పెంచాలని ఎంపిడిఒ కార్యాలయం సూపర్నెంట్ టి రమేష్ బాబుకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వినతి పత్రం శనివారం అందజేశారు. సిఐటియు కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి మాట్లాడారు. పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు అరకొర వేతనాలతో జీవిస్తున్నారని చెప్పారు. నిధుల కొరత పేరుతో నెలలు తరబడి జీతాలు ఇవ్వడం లేదని అన్నారు. కొన్ని పంచాయతీలో 9 నుండి 10 నెలలు జీతాలు రాని పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం వీరికి ఓహెచ్ఎ క్రింద 75జిఒ ద్వారా రూ.4వేలు వేతనం పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చిందని అన్నారు. పెరిగిన వేతనాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు రాయిని వినోద్ బాబు, గ్రీన్ అంబాసిడర్లు కె ఏసోబు, సిహెచ్ హరిబాబు, గుడిపాటి శ్రీను, మేడూరి ముసలయ్య, పాలపర్తి ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే లైసెన్సు రద్దు

ప్రజాశక్తి - వేమూరు

ప్రైవేటు దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు అమ్మితే లైసెన్సులు రద్దు చేయాలని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎరువుల కొరతపై అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. నియోజక వర్గంలో 1.15లక్షల ఎకరాలు సాగు భూమి ఉండగా ఇప్పటికీ ఆర్ఎస్‌కె, సొసైటీలు, ప్రైవేట్ డీలర్ల ద్వారా రైతులకు 4వేల మెట్రిక్ టన్నులు మాత్రమే చేరిందని అన్నారు. ఇంకా రైతులకు 10వేల మెట్రిక్ టన్నులు యూరియా అవసరం ఉందన్నారు. కౌలు రైతులు ఎక్కువగా ఉండటం వలన కౌలు రైతులకు అందేలాగా చూడాలని అన్నారు. వెంటనే రైతులకు అవసరమైన ఎరువులు దిగుమతి చేసుకోవాలని సూచించారు. ఎక్కడ ఎరువులు కొరత రాకుండా రైతులు ఎరువులు నిలువ చేయకుండా ఏ సీజన్‌కు ఆ సిజన్‌లో వాడుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎరువులు ఎక్కువ వాడటం వలన జరిగే నష్టాలు రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. వచ్చే ఎరువులు సొసైటీలు, ఆర్ఎస్‌కెల ద్వారా రైతులకు పంపిణీ చేయాలని, ప్రైవేటు ఫర్టిలైజర్ షాపుల్లో స్టాకు చెక్ చేసి నివేదిక ఇవ్వాలని అన్నారు. ఎరువులు ఎక్కువ ధరకి అమ్మితే షాపు లైసెన్సులు రద్దు చేయా లని ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా అధి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కారులు ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకో వాలని సూచించారు. రైతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, రేపల్లె ఎడిఎ లక్ష్మి, తహశీల్దారు బి సశీల, ఎఒలు, టిడిపి నాయకులు జొన్నలగడ్డ విజయ బాబు, మైనేని మురళీకృష్ణ, కనగాల మధుసూదన్ ప్రసాద్ పాల్గొన్నారు.

వినాయక లడ్డూ రూ.2లక్షలు

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని కైతేపల్లిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ ప్రసాదం వేలం నిర్వహించారు. వేలంలో లడ్డు రూ.2లక్షలు పలికినట్లు కైతేపల్లి గణేష్ యువసేవా సమితి సభ్యులు తెలిపారు. లడ్డు ప్రసాదాన్ని అల్లపర్తి సుజన్ మూడవ సారి దక్కించుకున్నారు.

భరత నాట్యం చిన్నారులను అభినందిస్తున్న దృశ్యం

చిన్నారులకు అభినందన

ప్రజాశక్తి - చెరుకుపల్లి

స్థానిక పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన బాల గణేష్ యూత్ వినాయక ఉత్సవాల్లో చిన్నారులు ప్రదర్శించిన భరతనాట్యం అలరించింది. ఈ సందర్భంగా భరత నాట్య బాలికలను పలువురు అభినందించారు.

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర ర్యాలీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్రకేసరి యూనివర్సిటీ ప్రాంగణంలో స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర ర్యాలీ శనివారం నిర్వహించారు. యూనివర్సిటీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎన్. నిర్మలామణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మలామణి మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం ప్రాధాన్యత గురించి వివరించారు. మొక్కలు నాటడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. పరిశుభ్రమైన ప్రాంగణం విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. ఈ ఒఎస్‌డి ప్రొఫెసర్ జి. రాజమోహన్ రావు, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. సోమశేఖర, ఎన్ఎస్ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ హర్ష ప్రీతం దేవ్‌కుమార్, అధ్యాపకులు బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి - ఒంగోలుసిటీ

వయోజన విద్య ఉపసంచాలకుల కార్యాలయంలో సూపర్‌వైజర్ ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సెలెక్షన్ చైర్మన్ జగన్ మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెకండరీ గ్రేడ్, వ్యాయామ, మరియు గ్రేడ్-2 పండిట్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కనీసం 10 ఏళ్ల సర్వీసు ఉండి వయస్సు 45 ఏళ్లు మించరాదన్నారు. గతంలో ఎంఎల్ఓ, ఎంఆర్‌పి, ఎస్ఆర్‌జి, డిఆర్‌జిగా పనిచేసిన వారికి,అదనపు అర్హతలు కలిగిన వారికి, అక్షరాస్యతా కార్యక్రమాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలలో అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివ రాలకు 9642149957 సెల్‌నంబరులో సంప్రదించాలన్నారు.





వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-తాళ్ళూరు

వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ ఇవ్వాలని డిప్యూటీ తహశీల్దార్ ఫణి తెలిపారు. రెవెన్యూ కార్యాల యంలో రేషన్ డీలర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి ఇచ్చే రేషన్ పర్సంటేజ్ చాలా తక్కువగా ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు పిన్నిక రమేష్, సుబ్బారెడ్డి, శ్రీను, పెరిరెడ్డి, శ్రీను, కృష్ణ, బ్రహ్మారెడ్డి, సాయి, విఆర్ఓ చంద్రశేఖర రావు పాల్గొన్నారు.



విజయోత్సవ ర్యాలీలో మహేంద్ర నాథ్

మహిళల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - చీరాల

మహిళల అభివృద్ధి, సంక్షేమ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలుగుదేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దూరి మహేంద్ర నాథ్ అన్నారు. పట్టణంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్, స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీ శనివారం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుండి గడియార స్తంభం వరకు ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ ఛైర్మన్ మించాల సాంబశివరావుతో కలిసి మాట్లాడారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్లు సూరగాని లక్ష్మి, స్వాతి, లలిత పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి 104 మంది హాజరైనట్లు రోటరీ అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ తెలిపారు. హాజరైన 104 మందిలో 88 మందికి కంటి శుక్లంల ఆపరేషన్లు చేయాలని శంకర్ నేత్రాలయ వైద్యురాలు డాక్టర్ చరిత తెలిపారు. ఈ 88 మందిలో 38 మంది పురుషులు, 50 మంది మహిళలు ఉన్నారని తెలిపారు. వీరిని శంకర్ నేత్రాలయ బస్సులో గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర కంటి ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి రాయిని రామారావు, క్లబ్ క్యాంప్ ఛైర్మన్ చిలుకూరు వీరరాఘవయ్య, తాటి చిన సుబ్బారావు, పేర్ని వీరనారాయణ, పోలిశెట్టి సీతారామయ్య, ఎస్‌కె కాలేషావలి, గుర్రం ఆంజనేయులు, డాక్టర్ బి రమేష్ పాల్గొన్నారు.

చందలూరు హైస్కూల్‌లో నిర్మిస్తున్న భోజన శాల

శరవేగంగా భోజనశాల నిర్మాణం

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని చందలూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో భోజన శాల నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. రూ.35 లక్షల అంచనాతో నిర్మిస్తున్న భోజనశాల నిర్మాణానికి బాపట్ల ఎంపి కృష్ణ ప్రసాద్ శంకుస్థాపన చేశారు. హైస్కూలుకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఈ భోజనశాల్లో భోజనం చేయాల్సి ఉంది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ భోజనశాలకు నిధులు మంజూరు చేయించారు. వారం రోజుల్లోనే బేస్ మట్టం వరకు నిర్మాణం జరిగింది. విద్యాదాత అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వడ్డపల్లి వీరనారాయణ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా పటిష్టంగా భోజనశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

వైభవంగా వినాయక విగ్రహ నిమజ్జనం

ప్రజాశక్తి - బాపట్ల

మట్టితో తయారు చేయించి విలేకరులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం నిమజ్జనం చేశారు. పట్టణంలో రెడ్ క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాన్ని చూసి పలువురు అభినందించారు. కార్యక్రమంలో వేజెండ్ల శ్రీనివాసరావు, బత్తుల సురేష్, బండ్రెడ్డి గోపి పాల్గొన్నారు.

మహిళా సాధికారతే చంద్రబాబు ధ్యేయం

- రూ.11.25 కోట్ల డ్వాక్రా రుణాల అందజేత
- స్త్రీ శక్తి విజయోత్సవ సభలో ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మహిళా సాధికారతే లక్ష్యంగా సిఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే మహిళలకు అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టిందని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో స్త్రీ శక్తి విజయోత్సవ సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంలో ముందుండే వ్యక్తి సీఎం చంద్రబాబు అన్నారు. 2004లోనే చదువుకునే ఆడబిడ్డలకు ఉచితంగా సైకిల్స్ అందించారని గుర్తు చేశారు. ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రతి నెల రాజకీయాలకతీతంగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులను పొగాకు కంపెనీలు మోసం చేశాయని, సిఎం చంద్రబాబును ఒప్పించి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఐటిసి కంపెనీ మాత్రం రైతులకు హామీ ఇచ్చిన ప్రకారం చెప్పిన రేటుకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతాంగ పక్షాన నిలిచిన ఐటిసి కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు. ఆడ బిడ్డలు, అక్కా చెల్లెమ్మలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేసి వారి కాళ్లపై వాళ్లు సొంతంగా వ్యాపారాలు చేసుకొని ఎదగాలన్నదే టిడిపి విధానం అన్నారు. మహిళ సాధికారత, మహిళా స్వావలంబన దృష్టిలో ఉంచుకొనే సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేశారన్నారు. మంత్రి లోకేష్ ప్రతిపాదించిన తన తెలుగు కుటుంబంలో భాగమైన స్త్రీ శక్తి విధానాన్నే సూపర్ సిక్స్ పథకం ద్వారా అమలు చేస్తుందన్నారు. మహిళలు, యువత, ట్రాన్స్ జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15 నుంచి ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలు ఉచితంగా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు చూపిస్తే చాలని, ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఆర్టీసీలో 11,449 బస్సులు ఉండగా 8,458 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తోందని అన్నారు. ఇందు కోసం ప్రభుత్వంపై ప్రతి నెలా రూ.162 కోట్ల చొప్పున ఏడాదికి రూ.1,942కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని తెలిపారు. ఈ ప్రయాణ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఆర్టీసీకి చెల్లిస్తుందన్నారు. ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశారని పేర్కొన్నారు. బాలికల విద్యకు ఎంతో ప్రోత్సాహకంగా నిలిచిన తల్లికి వందనం, పేదరికంలో ఉన్న కుటుంబాలు, బాలికలను ఉన్నతంగా చదివించాలనే ఆలోచనతో తల్లికి వందనం అమలు చేయడం ద్వారా కల్పించారని అన్నారు. దీపం పథకం ద్వారా మహిళలకు వంటింటి కష్టాలు దూరం చేసిందే టీడీపీ ప్రభుత్వం అన్నారు. పీ4కు అనుసంధానం చేసిన ఆడబిడ్డ నిధి పథకంతో పేద కుటుంబాల్లోని మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. స్త్రీ నిధి రుణాలు రూ.3.50 లక్షల నుంచి రూ.5 లక్షలకు, వడ్డీ రాయితీ రూ.3లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచారని అన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రతి నెలా 1న వేతనాలు అందిస్తోందన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు అందజేస్తోందని తెలిపారు. అందులో రూ.10 లక్షల వరకు వడ్డీ రాయితీ కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జరుగుల సంధ్య, జయమ్మ, మహిళా అధ్యక్షులు బత్తుల కృష్ణవేణి, ఉప్పుటూరు రమాదేవి, కర్రీ నాగేంద్రమ్మ, శారద, వనజ, పద్మావతి, రావిపాటి సంధ్య, జంపని రాధా, శాంతి, మాధవి కృష్ణ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎంఎల్ఎ ఏలూరి

విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా కృషి

మాట్లాడుతున్న క్లస్టర్ ఛైర్మన్ బాలప్రసాద్

ప్రజాశక్తి - కారంచేడు

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని కుంకలమర్రు పాఠశాలల సముదాయ ఛైర్మన్ బాల ప్రసాద్ కోరారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులకు అనేక సంస్కరణలు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. దానిలో భాగంగా ఇటీవల నిర్వహించిన మూల్యాంకనం అని చెప్పారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమావేశంలో 18 పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, హెచ్ఎంలు భాస్కరరావు, కూనల ఆంజనేయులు, ప్రసాదు, సముదాయ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంగులూరు : మండలంలోని పంగులూరు, చందలూరు, కొండ మంజూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించినట్లు ఎంఇఒ జి వీరాంజనేయులు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు, సబ్జెక్ట్ టీచర్లకు విడివిడిగా మీటింగ్ జరిపినట్లు కాంప్లెక్స్ ఛైర్మన్ సోమేపల్లి శ్రీనివాసరావు తెలిపారు. గత 10వ తరగతి పరీక్షల్లో వచ్చిన ఫలితాలు విశ్లేషించినట్లు తెలిపారు. ప్రస్తుతం చదువులో వెనుకబడిన సి, డి గ్రేడ్ల విద్యార్థుల గురించి చర్చించినట్లు తెలిపారు. సి, డి గ్రేడ్ల విద్యార్థులు చదువులో ఎందుకు వెనుకబడ్డారని, వారిలో ఉత్సాహం కల్పించి చదువులో ఎ, బి గ్రేడ్లతో సమానంగా చదివేటట్లు చేయాలని చర్చించారు. ఉపాధ్యాయులు సమిష్టి కృషి చేయాలని, మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు శక్తివంచన లేకుండా పనిచేయాలని అన్నారు.

కాంప్లెక్స్ మీటింగులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఓణీల వేడుకల్లో వినూత్న ఆలోచన

ప్రజాశక్తి - అద్దంకి

ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు ప్రత్యామ్నయంగా జూట్, కాటన్ క్యారీ బాగులు వాడాలనే చైతన్యం కలిగిస్తూ డాక్టర్ చదలవాడ ఫణింద్రబాబు, గృహలక్ష్మి కుమార్తె శృతిలయ ఓణీల వేడుకల ఫంక్షన్ హాలులో జరిగిన ఫంక్షన్ నందు వీరిచ్చే గిఫ్టులు అందించేందుకు జ్యూట్ బ్యాగ్స్ వెయ్యి ముద్రించి వచ్చిన బంధు, మిత్రులకు జ్యూట్ సంచులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్స్ విడనాడి జూట్, కాటన్ బ్యాగులు వాడితేనే జీవరాశికి మనుగడ ఉంటుందని అన్నారు. శుభకార్యాల్లో, దినచర్యలో ప్రతి ఒక్కరూ జూట్, కాటన్ బ్యాగులు ఉపయోగించాలని కోరారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, యోగ అధ్యాపకులు సిహెచ్ శేషారెడ్డి మాట్లాడుతూ ఎవరికి వాళ్లే మనది కాదులే అని ప్లాస్టిక్ కవర్స్ ఉపయోగిస్తే ప్లాస్టిక్ భూతం మానవాళిని కబళిస్తుందని అన్నారు. కార్యక్రమంలో చదలవాడ గృహలక్ష్మి, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, ప్రజారోగ్య వేదిక జిల్లా అధ్యక్షులు కావూరి రఘుచంద్, వీరవల్లి సుబ్బారావు, రుద్రయ్య, ఆర్‌కె ట్రావెల్స్ రామకృష్ణ, అద్దంకి లేవి ప్రసాద్, షేక్ మహమ్మద్ రఫీ, గోవాడ శ్రీకాంత్, చేబ్రోలు సుబ్బయ్య, షేక్ సుభాని, వేణు, మహేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ సిహెచ్ ఫణీంద్ర బాబు

మాట్లాడుతున్న ఛైర్మన్ కట్ట మంగ

అజెండా ఏకగ్రీవంగా ఆమోదం

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో అభివృద్ధి పనులకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం తెలిపింది. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో ఛైర్మన్ కట్ట మంగ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్విహించారు. అజెండాలో పొందుపర్చిన 33 అంశాలకు సభ్యులు ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. ఎలాంటి చర్చ లేకుండానే ఎజెండాలోని అంశాలు ఆమోదించినట్లు వైస్ ఛైర్మన్ తూనుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా తెలిపారు. వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఛైర్మన్ ప్రశాంత్ కుమార్, కమిషనర్ కె సాంబశివరావు, డిఈ మధుసూదనరావు, మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామచంద్రరావు, టిపిఒ గోవర్ధన్, ఆర్ఓ రత్నాంజలి పాల్గొన్నారు.

విగ్రహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు

తీరంలో శ్రీకృష్ణుడి విగ్రహం లభ్యం

ప్రజాశక్తి - చిన్నగంజాం

మండలంలోని మోటుపల్లి సముద్రం తీరంలో 3 అడుగుల శ్రీకృష్ణుని విగ్రహం శనివారం బయటకు వచ్చింది. సదరు విగ్రహంను ఆర్డీఒ చంద్రశేఖర్ నాయుడు ఆదేశాల మేరకు నాగులుప్పలపాడు మండలం కనుపర్తిలోని పురావస్తు శాఖకు భద్రత నిమిత్తం మోటుపల్లి విఆర్ఒ పి నాగరాజు ద్వారా అప్పగించినట్లు తహశీల్దారు జె ప్రభాకరరావు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి అద్దంకి

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 8 మందిని సీఐ ఏ సుబ్బరాజు కోర్టులో హాజరు పర్చారు. వీరిలో నలుగురు వ్యక్తులకు రూ.19 వేలు, ఓపెన్ డ్రింకింగ్ కేసులో నలుగురికి రూ.9వేల చొప్పున ఎజెఎఫ్ సిఎం కోర్టు మేజిస్ట్రేట్ బి అఖిల జరిమాన విధించినట్లు తెలిపారు.

ఎరువులు పంపిణీ చేస్తున్న ఎఒ నరేంద్రబాబు

రైతులకు ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని అనంతవరం రైతు సేవ కేంద్రం నందు ఎఒ వి నరేంద్రబాబు ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎఇఒ నిపున్ వంశీ, ఎంపీఈఓ అశోక్ పాల్గొన్నారు.

కార్యదర్శి తిరుమల రావును సన్మానిస్తున్న దృశ్యం

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - అమృతలూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధి సూచిక పిఎఐ 2.o అను అంశంపై ఎంపీపీ, ఎంపీటీసీలు, జడ్పిటిసి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ఒకరోజు శిక్షణ శనివారం నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి సూచికకు సంబంధించిన 13 రకాల డిపార్ట్మెంట్ల నుండి డేటా కలెక్షన్ ఫార్మేట్లను (డిసిఎఫ్) సేకరించి ఆన్లైన్లో నమోదు చేసే విధానంపై ఒకరోజు శిక్షణ నిర్వహించారు. అనంతరం 79వ స్వతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డులు పొందిన కూచిపూడి పంచాయతీ కార్యదర్శి బి తిరుమలరావు దుశలవాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర కుమార్, ఎంపిడిఒ మారుతి శేషమాంబ, డిప్యూటీ ఎంపిడిఒ వినయ్ బాబు, ఎంఈఓ రమేష్ బాబు, మధుసూదనరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కొల్లూరు ఎంపిడిఒ

కొల్లూరు : పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనకు చేపట్టాల్సిన చర్యలు, పంచాయతీల ర్యాంకింగ్ మెరుగు పర్చుటకు తీసుకోవలసిన చర్యలపై ఒకరోజు శిక్షణ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, జెడ్పిటిసి చొప్పర సుబ్బారావు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంట పర్యటన

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు ఈనెల 31, సెప్టెంబర్ 1 తేదీలలో పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈనెల 31న సాయంత్రం 4 గంటలకు ఒంగోలు ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. రాత్రి 7 గంటలకు ఒంగోలులో స్థానికంగా జరిగే కార్యక్రమాలకు హాజరవుతారు. రాత్రి 7.30 గంటలకు ఒంగోలు గాంధీ రోడ్డుల గోల్డ్, సిల్వర్ మర్చంట్స్ అసోసియేషన్ తాతా ప్రసాద్ ఆధ్వర్యంలో, కోర్ట్ సెంటర్లో కార్పొరేటర్ తిప్పరమల్లి రవితేజ ఆధ్వర్యంలో, నగరంలోని పలు ప్రాంతాలలో జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలలో పాల్గొంటారు. రాత్రి 9 గంటలకు ఒంగోలు ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 09.00 సా ఒంగోలులో యం.పి. కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో వుండుట. సెప్టెంబర్ 1న ఒంగోలు ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 10 గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2 గంటలకు ఒంగోలు ఎంపి కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

వికలాంగుల సీట్లు వారికే కేటాయించాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆర్టిసి బస్సుల్లో వికలాంగుల కోసం ప్రభుత్వం ప్రత్యేక సీట్లను వారికే కేటాయించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా కోరారు. ఈ మేరకు ప్రకాశం జిల్లా రీజినల్ మేనేజర్ జి సత్యనారాయణకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలేషా మాట్లాడుతూ వికలాంగుల కోసం సీట్లు కేటాయించినప్పటికీ వాటిని సాధారణ ప్రయాణీకులు ఆక్రమించి వికలాంగులను అవమానపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులకు కేటాయించిన సీట్లలో సాధారణ ప్రయాణీకులు కూర్చోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు ఫిర్యాదు చేసినా వారు నిర్లక్ష్యంగా ఖాళీ సీట్లలో కూర్చోండని సలహాలు ఇస్తున్నట్లు ఆరోపించారు. జాతీయ వికలాంగుల హక్కుల

ఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న కాలేషా

చట్టం 2016 ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేక పోవడం విచారకరమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని డిపో మేనేజర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి వికలాంగులకు కేటాయించిన సీట్లలో వారే కుర్చొనేవిధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పారదర్శకంగా బార్ల కేటాయింపు ప్రక్రియ

డిఆర్ఒ బి చిన ఓబులేసు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో బార్లను లాటరీ ద్వారా పారదర్శకంగా కేటాయించినట్లు డిఆర్ఒ బి చిన ఓబులేసు తెలిపారు. ఒంగోలు పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో శనివారం లాటరీ ద్వారా ఓపెన్ కేటగిరి, గీత కులాలకు 21 బార్లు కేటాయించారు. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని 11 బార్లకు 48 మంది దరఖాస్తుదారులు లాటరీలో పాల్గొన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో రెండు బార్లకు ఎనిమిది మంది, చీమకుర్తి మున్సిపాలిటీలో ఓ బార్కు ఆరుగురు, పొదిలి మున్సిపాలిటీలో 1 బార్కు నలుగురు, దర్శి మున్సిపాలిటీలో 1 బార్కు నలుగురు, కనిగిరిలో 1 బార్కు నలుగురు, గిద్దలూరులో 1 బార్కు నలుగురు దరఖా స్తుదారులు లాటరీలో పాల్గొన్నారు. గీతకులాలకు సంబంధించి ఒంగోలు కార్పొరేషన్లో 1 బార్కు ఆరుగురు దరఖాస్తుదారులు లాటరీలో పాల్గొన్నారు, మార్కాపురంలో 2 బార్లకు ఎనిమిది మంది లాటరీలో పాల్గొన్నారు, ఓపెన్ కేటగిరీలో 18 బార్లకు డ్రా తీసి దుకాణాలు కేటాయించారు. గీత కులాలకు సంబందించి 3బార్లకు ముగ్గురు దరఖాస్తు దారులకు లాటరీ ద్వారా కేటాయించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయ, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఎస్.ఆయేషా బేగం పాల్గొన్నారు.

గ్రంథపాలకుల పోస్టులు భర్తీ చేయాలి

పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి మల్లేశ్వరరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

గ్రంథాలయాలలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే కొత్త నియామకాలు చేపట్టాలని రాష్ట్ర గ్రంథాలయ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి మల్లేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ల క్రితం నుంచి సిబ్బంది నియామకాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలు నేటికీ కొనసాగడం అన్యాయమని అన్నారు. దీంతో అనేక గ్రంథాలయాలు మూతపడే స్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె త్రిమూర్తులు మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, పెన్షనర్లకు 010 పద్ధతి కింద జీతాలు, పెన్షన్లు చెల్లించాలన్నారు. పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జి గురవయ్య, గౌరవ సలహాదారుడిగా బి శ్రీరామమూర్తి, అధ్యక్షుడిగా డివి సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి లక్ష్మీనాథ్, కార్యదర్శిగా ఎ రమేష్ బాబు, కోశాధికారి డిబివి సుబ్బారావు, కమిటీ సభ్యులుగా ఎస్. నాగేశ్వరరావు, బి. శ్యామ్యూల్ ఎన్నికయ్యారు. నూతన కమిటీకి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శివారెడ్డి అభినందనలు తెలియజేశారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ రవీంద్ర

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అద్దంకి

హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి సంక్రమించిన తర్వాత పశ్చాత్తాపం పడకంటే నివారణే ఉత్తమమని కమిషనర్ రవీంద్ర పేర్కొన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం (దిశా) ఆధ్వర్యంలో హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన అవగాహనకు 60 రోజులు పాటు జరిగే ఇంటెన్స్ స్పైడర్ ఐఈసి విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో గోడపత్రికలు ఏర్పాటు చేశారు. యువత హెచ్ఐవి బారిన పడటం కారణంగా కనిపిస్తుందని హెల్ప్ టిఐ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. స్థానిక పిహెచ్సి ఐసిటిసి కౌన్సిలర్ జి రమేష్ మాట్లాడారు. టిఐ ఔట్రిచ్ వర్కర్ టి దుర్గాభవాని, డి బలరామిరెడ్డి, టి లక్ష్మీ, తేజస్విని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ జాకోబ్ ధర్మరాజు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని పందిళ్ళపల్లిలోని ప్రిపేర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చీరాల, వేటపాలెం, చిన్నగంజాం మండలాల్లో 50 గ్రామాల్లోని రైతులకు ఫార్మర్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలపై రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ప్రిపేర్ అధినేత డాక్టర్ జాకోబ్ ధర్మరాజు భూమి పొరలు, భూమిలో ఉండే మినరల్స్, కార్బన్ ఎగుమతిని పెంచుకునే విధానాలు, నేల రకాలు, విత్తనాలు నాటే విధానం తెలిపారు. ప్రిపేర్ కోఆర్డినేటర్ ఎం రవిచంద్ర, జి ఆశ, శ్రీలేఖ, పావని, నాగజ్యోతి, మెర్సీ, మంజుల, హెప్సిబా, స్వాతి, దేవమని, రాజకుమారి, ఎం వెంకటేశ్వర్లు, ఎస్వి రమణారెడ్డి, ప్రసన్న కుమారి, మయూరి, కార్తిక, కవి ప్రీతి పాల్గొన్నారు.

ఎజిపికి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ సిఫారసు మేరకు ఎజిపిని నియమించారు. ఈ సందర్భంగా శనివారం మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్, ముస్లిం సంక్షేమ సంఘం లీగల్ ఇంచార్జ షేక్ అబ్దుల్ జబ్బర్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు షేక్ కరీముల్లా, 19వ వార్డు ఇన్చార్జి షేక్ మొహిద్దిన్, ముస్లిం మైనార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రసూల్, షేక్ మస్తాన్ సాహెబ్ శుభాకాంక్షలు తెలిపారు.

కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అధికారులు

గొర్రెల కాపరి క్షేమం

ప్రజాశక్తి - రేపల్లె

మండలంలోని మోర్తోట గ్రామానికి చెందిన డొక్కు చిన్న వీరయ్య శుక్రవారం గొర్రెలు మేపుకు కృష్ణా నది ఒడ్డుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు, సిఐ మల్లికార్జునరావు గాలింపు చర్యలు చేపట్టారు. మండలంలోని లంకివానిదిబ్బ తీర ప్రాంతంలో ఉన్నట్లుగా ఆచూకీ లభించడంతో ఆయనను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

7న శింగరకొండ ఆలయం మూత

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో భాద్రపద శుద్ధ పౌర్ణమి చంద్రగ్రహణం కారణంగా సెప్టెంబర్ 7న ఆదివారం మహా నివేదన అనంతరం మద్యాహ్నం నుండి దేవస్థానం తలుపులు మూసివేయబడతాయని, తదుపరి 8న సోమవారం ఆలయ శుద్ధి సంప్రోక్షణ అనంతరం ఉదయం 8:30గంటలకు తెరవబడుతుందని ఇఒ మదమంచి తిమ్మనాయుడు తెలిపారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం జరుగుతుందని తెలిపారు.

మాట్లాడుతున్న పిహెచ్సి డాక్టర్ గొట్టిపాటి జయసింహ

కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ప్రజాశక్తి - అద్దంకి

సీజనల్ వ్యాధులు కారణంగా ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగుతూ జాగ్రత్తలు తీసుకోవాలని గాజులపాలెం యుపిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ గొట్టిపాటి జయసింహ అన్నారు. స్థానిక పిహెచ్సి ఆవరణలో ఆరోగ్య సిబ్బంది సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. దోమల వలన వచ్చే డెంగ్యూ, మలేరియా వ్యాధి లక్షణాల నివారణ చర్యలు, శానిటేషన్ గురించి సిబ్బందికి సూచనలు చేశారు. టైఫాయిడ్ వ్యాధి గురించి సమీక్షించారు. కలుషిత ఆహారం, నీరు తీసుకోవడం వలన ఇది సంభవిస్తుందని అన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా, ఎఎన్ఎం, ఆసుపత్రి సిబ్బందికి దోమల నివారణ, కాచి చల్లార్చిన నీటిని, ఇంటి భోజనం పట్ల క్షేత్రస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే స్థానిక పిహెచ్సిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు దోమతెరలు వాడడం, కిటికీల తలుపులకు మెస్సులు, ఇంటి పరిసరాల్లోపు నీటి నిల్వ లేకుండా చేయడం వంటి చర్యల ద్వారా వ్యాధులు అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఇంటిని ఫీవర్ సర్వే చేయాలని సూచించారు. జ్వరపీడితెలు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను సంప్రదించి వైద్యం పొందాలని చెప్పారు. పానీపూరీ వంటి ఆహార పదార్థాలు తీసుకోకూడదని తెలిపారు.

పోలీసు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

పోలీస్ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటూ వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని ఎస్‌పి తుషార్ డూడి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'పోలీస్ వెల్ఫేర్ డే' శనివారం స్వయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సంక్షేమంలో భాగంగా బాపట్ల జిల్లా పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో మరణించిన పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు, పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులతో ఎస్‌పి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలు, ఇతర రాయితీల గురించి సమీక్షించారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన భద్రతా నిధులు, జిపిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ నగదు రాయితీలు సకాలంలో అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ ఉద్యోగులకు, సర్వీసులో ఉండి మృతి చెందిన పోలీస్ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. పోలీస్ యంత్రాంగం వారి కుటుంబ సభ్యులు పోలీస్ కుటుంబంగా భావిస్తామన్నారు. వారి సంక్షేమం చూడాల్సిన బాధ్యతపై ఉందన్నారు. భాదిత కుటుంబం, వారి పిల్లల చదువుల విషయంతో ఎలాంటి సమస్యలైనా తమ దష్టికి తీసుకువస్తే వటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలోఎఒ వి. శ్రీనివాసరావు, సిసిఎస్ డిఎస్‌పి పి.జగదీష్ నాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ షేక్ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి తుషార్ డూడి